# ముప్పుతిప్పల ముకుందరావ్

(ఐ. పి)

అంగారకుడు

మొన్నటి దీపావళికి బొంబాయి నించి మాస్నేహితుడి తండ్రి ఒకాయన ఇక్కడకు వచ్చాడు. బొంబాయి రాష్ట్రంలో ఉద్యోగంచేసి రిటైరయినాడాయన. నాలుగు నెల్లపాటు ఇక్కడే ఉండాలని అనుకుని, ఆ నాలుగు నెలలూ పెన్షన్ ఇక్కడే తీసుకోవాలని అనుకున్నాడు. పెన్షన్‌ట్రాన్స్‌ఫర్ చేయటానికి ఈవూళ్ళో ఒక జె. పి. (జస్టిస్ ఆఫీస్) సర్టిఫికేట్ ఇవ్వవలసివచ్చింది.

జె. పి. గారు ఎక్కడ కనిపిస్తారా అని విచారించగా ఒకాయన ఫలానా వీధిలో ఉన్నట్లు తెలిసింది. ఇంటి నంబరు సరిగా తెలియకపోవటాన, వీధి మొదట్లో ఒకాయన్ను ఫలానా జె. పి. గారి ఇల్లెక్కడండీ అని అడిగాను. ఆయన ఒక ఇల్లు చూపించాడు.

లోపల ఒక పెద్దమనిషి ఆహ్వానించి కూర్చోపెట్టాడు. నేను నా సొద వెళ్ళబోసుకున్నాను. అంతా విని ఆయన పకాలున నవ్వాడు.

“నా సర్టిఫికేట్ తీసుకుని వెడితే మీ స్నేహితుడికి మొదటికే మోసం వస్తుందేమో” అన్నాడాయన నవ్వుతూ.

నేను ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని చూస్తున్నాను.

“నేను ఫలానా జె. పి. గారి ననుకుంటున్నట్లున్నది. నాపేరు ముప్పుతిప్పల ముకుందరావు ఐ. పి.-అంటే ఇన్సాల్వెన్సీ పిటీషనర్ అన్నమాట.”

నేను నోరు తెరవటమే కాక నిలువు గుడ్లను కూడా వేశాను.

“జె. పి. గారిల్లు ఇక్కడనించి మూడోదే. ఆయన సాయంత్రందాకా రారు. కాసేపు కూర్చుని వెళ్లండి.” అన్నాడు.

“నేను పత్రికవాడినని తెలుసా?”

“ఆ! విశ్వరూపం విలేకరులని కూడా తెలుసు. అయితే యేం మింగేస్తారా?” అన్నాడాయన నవ్వుతూ.

* * * *

“అయితే మీరు ఐ. పి. అన్నమాట” అన్నాను. ఏమీ తోచక.

“అవునండీ. దివాలా చక్రవర్తిని. అప్పులవాళ్లపాలిటి అపర యముణ్ణి.”

“మీ తారక మంత్రం మాకు కూడా ఉపదేశించండి బాబూ! చచ్చిపోతున్నాం.”

“ఎక్కడ మొదలుపెట్టాలో, ఎక్కడ ముగించాలో నాకు తెలియదు. కనుక మీరే నాలుగుప్రశ్నలు వేయండి.”

“జనం చూస్తూ చూస్తూ అప్పులవాళ్ల బంధాల్లో ఇరుక్కుంటారు దేనికండీ?”

“అందరికీ చేతినిండా పనీ, కడుపునిండా తిండీ ఉన్నరోజుల్లో అప్పులు తీసుకోవలసిన అవసరం ఎక్కువ ఉండేది కాదు. అయితే బొత్తిగా లేదని మాత్రం చెప్పను. చేతిపనులు యంత్రాలకు దారి ఇచ్చిన తరవాత, డబ్బు కొద్దిమందిదగ్గరే చేరటం మొదలుపెట్టింది. మిగిలినవాళ్లు సంపాదించేది చాలక అప్పులకు దిగుతున్నారు.”

“అయినా, అందులో ఉన్న ఇబ్బందుల్ని గుర్తించారా?”

“గుర్తించకేం? అన్నీ తెలిసే, ఇంకో దారి లేకపోవటాన ఆ మార్గాన్ని అవలంబిస్తారు. అక్కడిదాన్ని ఇక్కడికీ, ఇక్కడిదాన్ని అక్కడికీ, సర్ది పిల్లిమీద ఎలుకనూ, ఎలుకమీద పిల్లినీ ఎక్కించకపోతే, వాళ్ళపొయ్యిలో పిల్లి లేవదు. అయితే చిక్కులు తెలిసే ఉండటంవల్ల, అప్పుతీసుకున్నప్పటినుంచి ఎగనామం పెట్టటం ఎట్లాగా అనే ఆలోచిస్తూ ఉంటారు.”

“ఈ నియమం అందరికీ వర్తిస్తుందా?”

“ఆహా! వ్యక్తులకేకాదు. పెద్దపెద్ద సామ్రాజ్యాలకే వర్తిస్తుంది. రవి తన సామ్రాజ్యంలో అస్తమించడని చెప్పుకునేరోజుల్లోనే బ్రిటన్ బాకీలు ఉన్నవారి లెక్కచెప్పటం కష్టంగాఉండేది. ఇప్పుడు అడగనే అక్కర్లేదు.”

“వడ్డీలు ఎన్నిరకాలండీ?”

“నాలుగు. బారువడ్డీ, చక్రవడ్డీ, సున్నావడ్డీ, హళ్లీవడ్డీ.?

“ఏమిటండోయ్ కొత్తవాటిని కూడా చెపుతున్నారు!”

“కొత్త యేమున్నదండీ! సున్నావడ్డీ అంటే, నోటులో ఎంతవడ్డీని రాసినప్పటికీ, వడ్డీమాట దేవుడెరుగు, అసలునైనా ఇప్పించవయ్యా బాబూ” అని షావుకార్లు కాళ్లా వేళ్లాపడగా, చెల్లించేవడ్డీ అన్నమాట. హళ్లీవడ్డీ అంటే, వడ్డీతోపాటు అసలుకుకూడా సున్నా చుట్టటమన్నమాట.” అన్నాడాయన నవ్వుతూ.

“ఇట్లాగే అప్పులిచ్చేవాళ్లల్లో కూడా వేరు వేరు తరహాలవాళ్లున్నారా?” అన్నాను నేనుకూడా నవ్వుతూ.

“ఓ! చాలమంది ఉన్నారు. అప్పులవాళ్లు, చెప్పులవాళ్లు అన్న సామెత ఉన్నది చూశారూ, అసలది అప్పులిచ్చేవాళ్లని పట్టే ఏర్పడ్డది.”

“ఇదేదో మామూలుపద్ధతికి భిన్నంగా ఉన్నది. కొంచం మీరు వివరించాల్సిందే.”

“ఏముందీ? అప్పులిచ్చేవాళ్లు నానా గోత్రాలవాళ్లూ ఉంటారు. ఒక్కొక్క జాతివాడు ఒక్కొక్కరకం చెప్పుల్ని వాడతాడు.”

“ఇప్పటికి మీ లెక్కలో ఎన్ని రకాలవాళ్లు తేలారు?”

“కిర్రుచెప్పుల తెలుగుషావుకారు, చంకీ చెడావుల మార్వాడీ, కాబూలీ చెప్పుల కాబూలీవాడు, చెప్పులే అక్కర్లేని నాటుకోటుసెట్టి-వీళ్లంతా నాటురకాలు. ఇంక సీమసరుకులో పేటెంట్ షూల బ్రిటిష్‌షావుకారూ, ప్లాస్టిక్ షూల అమెరికన్ షావుకారూ, చెప్పుకోతగ్గవాళ్లు.”

“వీళ్లదెబ్బ - క్షమించండి - మీదెబ్బ వీళ్లకేమయినా తగిలిందా?”

“నాటురకాలంతా మనతడాఖా చూసినవాళ్ళే. ఇంక తెల్లవాళ్ల సంగతి. వాళ్లు దేశాలకి దేశాలనే ముంచుతారుకాని నాబోటివాళ్లజోలికి రారు.”

“వేసుకున్న చెప్పులమోస్తరే వాళ్ల వ్యవహారంకూడా మారుతూఉంటుందా?”

“అవును. మారుతునేఉంటుంది. తెలుగుషావుకారూ, మార్వాడీ షావుకారూ ఎక్కువగా కోర్టులమీదనే ఆధారపడతారు. కాబూలీవాడు జబ్బ పుష్టిమీద

ఆధారపడతాడు. నాటుకోటు చెట్టి కోర్టుల్నీ, రౌడీలనూ కూడా ఉపయోగించుకుంటాడు. తెల్లషావుకార్లు కమ్యూనిస్టులమీద కత్తికట్టే యావన్మందినీ ఉపయోగించుకుంటారు"

"మనదేశంలో కాబూలీవడ్డీవ్యాపారస్తులమీద ఆ మధ్య నిషేధాలు విధించారెందుకండీ?"

"వాళ్లసలు బందిపోటుముఠాలు. కొన్నాళ్లు సరిహద్దుప్రాంతంలో దాగ కొట్టటం, కొన్నాళ్లు మనప్రాంతంలో వడ్డీ వ్యాపారం చేయటం వాళ్లకి అలవాటయిపోయింది, కోర్టులకెక్కని ఆ గర్భాత్రపుగాళ్ళకు ప్రభుత్వం ఉద్వాసన చెప్పింది"

"అది అన్యాయంకదుటండీ! ఇళ్లు జప్తుచేసి, ముసలీ ముతకా, కుంటీ గుడ్డీ, పిల్లా జెల్లా అని చూడకుండా ఇంట్లోవాళ్లని వెళ్లగొట్టే ఇతరషావుకార్లు మంచివాళ్లయి, కాబూలీవాళ్లు కాకపోయినారా?"

"కోర్టులకి డబ్బుపొయ్యరుగా? అందుకనే వెళ్లగొట్టారు. ఈ మధ్య రాజ్యాంగపరిషత్తులో కొందరు రాజ్యాంగాన్ని విమర్శిస్తూ అది లాయర్లపాలిటి కల్పవృక్షం అన్నారిందుకనే"

"అప్పు పుచ్చుకునేవాళ్లకూ, ఇచ్చేవాళ్లకూ సంబంధ బాంధవ్యాలు ఎట్లా ఉంటయ్?"

"చాలా తమాషాగా ఉంటయ్. అప్పుఇచ్చేనాడు ఆప్తమిత్రుడుగా కనిపించే ఋణదాత, అడిగవచ్చే నాటికి అపర యముడయిపోతాడు. "ఇంకాస్త అవసరమయితే పట్టుకెళ్లవయ్యా, అనమాన మెందుకు?" అని తియ్యటి కబుర్లుచెప్పే ఆసామీ, ఆ మరుక్షణంనుంచీ అప్పుతీసుకున్నవాడిని బుక్కాఫకీరుగా చెయ్యాలని ఎత్తులు వేస్తూ ఉంటాడు. నోట్లు రాసిన సిరాఅయినా ఎండకముందే తలపట్లకి దిగుతారు"

"పెళ్లినాటివరకూ బావగారూ, బావగారూ అనుకునే వియ్యంకులు, మర్నాటినుంచీ జావ్ దూర్, జావ్ దూర్ అన్నట్లుగా"

ముప్పయిరెండు పళ్లూ బైటపెట్టి నవ్వుకున్నారు ముకుందంగారు.

"సరిగ్గా అదేమోస్తరు. తరుచుగా అప్పిచ్చినవాడిదే పైచెయ్యి అవుతూఉంటుంది కాని, అప్పుడప్పుడు కొందరు ఉద్దండపిండాలు తూకాన్ని తలకిందులు చేస్తారు,"

"ఏదో మీవంటివాళ్ళన్నమాట."

హొహ్హొహ్హో! ఆమధ్య మావాడొకడు అప్పుచేశాడు. షావుకారు రోజు వేధిస్తూ ఉండేవాడు. ఒకరోజున దారిలో నిలబెట్టి అడిగేటప్పటికి, మావాడు ఆయన్ని ఎగాదిగా చూసి "ఇదుగో! చూడు బాబూ, నువ్వు ముళ్ళకంచె మీద గుడ్డపడేశావ్. అది కొంచెం జాగర్తగా తీసుకోవాలిగాని, తొందరపడితే ఎట్లా?" అని తాపీగా అన్నాడు. ఆ షావుకారు మళ్లీ అడిగితే ఒట్టు"

"అంతా అట్లా చెప్పి నిభాయించుకోగలరా?"

"అదీనిజమే ననుకోండి. అంతా నిభాయించుకోలేరు. కొందరు ఆస్తిపాస్తుల్ని ఎవరిపేరనో పెట్టి, ఐ పి పెట్టి కాళ్లు బారజాపుతారు. అప్పులవాళ్లు చాదస్తులయి సర్కార్ హోటలు ఖర్చు పెట్టుకుంటే నాలుగునెల్లు విశ్రాంతి అనుభవిస్తారు. దాన్నే దివాలాతీయటం అంటారు"

"దివాలావల్ల మనిషి విలువా, గౌరవం పోతయ్యేమో!"

"ఏమీ పోవు. అసలు వ్యాపారమంటేనే జగత్ దోపిడీ. ఈ ఐ పి గాళ్లు తమని దోచేవాళ్లులే అని వ్యాపారస్తులు సర్దుకుని పోతారు. మనదగ్గర డబ్బుంటే, జనం అన్ని సద్గుణాలనూ మనకే అంటకడుతుంది. పైపెచ్చు దివాలా దివాలాకూ మనిషి విలువ పెరిగిపోతుంది"

"అందుకే అనుకుంటూ, ఏడు దివాలాలెత్తినవారిని వెతికి తెచ్చి పిల్లనియ్యమంటారు"

"తప్పకుండా అందుకేఅయిఉంటుంది"

"తెల్లవాళ్లవ్యాపారాన్ని గురించి ఏదో అన్నారు ఏమిటది?"

"తెల్లవాళ్లు మొదట్లో నీగ్రోలను బానిసలుగా అమ్మి, ఎర్ర ఇండియన్లను నరికీ, నల్ల ఇండియన్లను దోచుకునీ, డబ్బును సంపాదించారు. ఆ డబ్బుతో ఫాక్టరీలు పెట్టి ఇంకా సంపాదించారు"

"మీరు సామ్రాజ్యవాదపు చరిత్రను ఏకరువు పెడుతున్నారు"

"సామ్రాజ్యవాదమంటే ధనాభివృద్ధి ప్రయత్నాలే. బ్రిటిష్‌సామ్రాజ్యం ఉన్నది ఇంపీరియల్ ప్రిఫరెన్సులకోసమేగా?"

"సరే, తరవాత చెప్పండి"

"తెల్ల దేశాలు తమదగ్గరి డబ్బును పెట్టుబడి పెట్టటంకోసం ప్రపంచమంతా తిరిగినయ్. చైనావంటి దుర్బలదేశాలకు తుపాకీ చూపించి అప్పుతీసుకునేటట్లు చేసినయ్. వెనకపడ్డ దేశాలన్నింట్లోనూ తమమాట వినే కీలుబొమ్మలను ఏర్పాటుచేసినయ్"

"అప్పులు దొరకటం ఆ దేశాలకు మంచిదేగా?"

"ఆ డబ్బు మనకి లాభం కలిగినట్లు ఉపయోగించడానికి వీలయినప్పుడే మంచిదవుతుంది. అందుకని తెల్లవాళ్లు, సొంతజనాన్ని నరకాలని ప్రయత్నించే చాంగ్ కైషేక్, సింగ్మన్‌రీలకు అప్పిస్తారేకాని, నిజంగా పైకిరాగల దేశాలకు ఇవ్వరుగా!"

"లేదండీ! ఏవోకొన్ని షరతుల మీద ఇస్తారట"

"ద్ధ తెలివితక్కువ వాజమ్మలూ, దేశం ఏట్లాయేడిస్తేయేం, మనకి నాలుగు డబ్బులు రాలుతయ్‌కదా అనుకునే దగుల్బాజీయూ, తప్ప ఇంకెవ్వరూ వాటికి ఒప్పుకోరు. అందుకనే అన్నిదేశాలూ తిరిగివచ్చిన నెహ్రూ అప్పుమాటయినా ఎత్తకుండా వచ్చాడు"

"సింగ్మన్‌రీ లాంటివాళ్లకు ఇచ్చే డబ్బు గంగపాలేమో?"

"కాదు, వాళ్లని ఏదోవిధంగా అధికారంలో నిలబెడితే, తమ డబ్బుకి వెయ్యింతలు తిరిగివస్తుంది. అంతగా నష్టమయితే పన్నులు కట్టే మామూలు జనంమీద తోస్తారు"

"సరే మన తెలుగువాళ్ళ వైఖరి ఏమిటి?"

"చాలా హుషారైన వైఖరి. అప్పులైతే నేమిరా మరి పప్పులైతే నేమిరా, అప్పు సప్పూ చేసి పప్పు ధప్పళమే కొడదామురా అంటారు"

"అంత బేఫ్రాకీగా ఉంటారా?"

"సుమతీ శతకం చూడండి తెలుస్తుంది. ఊళ్లో ముందు అవసరమయింది అప్పిచ్చువాడేనట"

"ఋణదాతల్లో గొప్పవాడెవరండీ?"

"విశ్వామిత్రుడు"

"ఆఁ?"

"అవును అందరికన్నా ఆయనే గట్టి


## నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు ఆయుర్వేద చికిత్స తెల్లనిరంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచెమై యుండిన రు 2-8-0 3 ఒకేసారి రు 6-8-0 మధ్యరకమై యుండిన, రు 3-8-0, 3 సీసాలు ఒకేసారి రు 9 పూర్తిగాయుండిన రు 5/- 3 ఒకేసారి రు 12/-

VIJOY LABORATORIES No 14
P O Manoharpur (Singhbhum)

వాళ్ళు బాకీ రాబట్టటానికి బాకీదారుడే స్వయంగా అలుబిడ్డల్నీ, తననూ అమ్ముకునేట్లు చేశాడు"

"ఎట్లా చేయగలిగాడు?"

"ఫస్ట్‌క్లాసయిన ఏజంటుని సంపాదించాడు ఆయన పేరే నక్షత్రకుడు"

వారు నవ్వాగలేదు

"నవ్వబోకండి ఒక అపరనక్షత్రకుడి తడాఖా నేను చూశాను నేను నా జన్మలో ఒక్కసారే అప్పను చెల్లించాను ఆయన నన్ను ఒక్కమాటకూడా అనేవాడు కాదు కనిపించిన సారల్లా పైకంసంగతి ఏంచేశారు అనేవాడు మూడు పూటలా ఇంటిదగ్గర హాజరు చివరికి వాడి బాధ భరించలేకపోయినాను"

"బాకీగనూలుకి ఇదే మంచి పద్ధతంటారా?"

"అక్షరాలా"

ఈ పద్ధతి బాగుందనిపించింది కాని మనకు కావలసింది వేరే విషయం

"ఏమండీ, అప్పుని సంపాదించే టెక్నిక్ ఏమిటి?"


"మీరన్నదే ఆ టెక్నికే టెక్కు, నిక్కు కలిస్తే టెక్నిక్ అప్పు కావాలంటే ఫెళఫెళలాడిస్తూ! డబ్బంటే లక్ష్యంలేని వాడల్లే నటించాలి అప్పుడే షావుకార్లు ట్రాప్‌లో పడతారు"

"మన దేశాన్ని ఎదుర్కొనే పెద్దసమస్య ఏమిటి?"

"అప్పుల బాధ జనసామాన్యం అప్పులతో బాధపడుతున్నప్పుడు వాళ్లు చేయ కలిగేది సేవింగ్ కాదు షేవింగే"

"ప్రభుత్వం డెటారిలీఫ్ఆక్టు పెట్టిందిగా!"

"మనవాళ్లు ఏదిచేసినా అంతే వడ్డీ



కేంద్ర ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ మొసలికంటి తిరుమలరావుగారు గోదావరిజిల్లాలో తయారైన ఖద్దరు పొశ్కా-గుడ్డను ప్రధాని నెహ్రూగారికి సమర్పించారు నెహ్రూగారి కుమార్తె శ్రీమతి ఇందిరాగాంధీ దానిని స్వీకరించారు

తగ్గించమన్నారే కాని అసలు అప్పిచ్చే నాథుడేడీ?"

"కో ఆపరేటివ్ బ్యాంకులు పెడుతున్నారుగా?"

"మీరు వాట్లిల్లో ఎప్పుడూ అప్పు తీసుకోలేదన్నమాట దేశంలో యావత్తు వ్యవహారాలూ ఆపద్ధతిలో నడిస్తేనే వాటివల్ల ఉపయోగం ఉంటేది"

"ప్రజలకు మీరిచ్చే సలహా ఏమిటి?"

"సమర్థులు, ఎడా పెడా అప్పులు తీసుకోవాలి ఈ ప్రభుత్వం వడ్డీలు తగ్గిస్తే, రేపొచ్చే ప్రభుత్వం వాటిని అసలు కొట్టి పారెయ్యొచ్చు నందో రాజా భవిష్యతి"

"అసమర్థులో?"

"జాయింట్ స్టాక్ కంపెనీలూ, లిమిటెడ్ కంపెనీలూ ప్రారంభించి దివాలా ఎత్తించమనండి అదుగో మీ జె పి గారు అప్పుడే వస్తున్నారు" అన్నారు ముకుందంగారు